నమస్తే తెలంగాణ



# ఆహ్లాదం.. అధ్వానం!

- పల్లె ప్రకృతి వనాల నిర్వహణను పట్టించుకోని పాలకులు
- ఎండిపోతున్న మొక్కలు, శిథిలావస్థకు చేరిన పిల్లల ఆట వస్తువులు
- పశువులు, మందుబాటులకు అడ్డాగా వేంసూరు 'వనం'










వేంసూరు మండలంలో అధ్వానంగా ఉన్న పల్లె ప్రకృతి వనాలు

గత కేసీఆర్ ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలకు రూపకల్పన చేసి ప్రతిష్టాత్మకంగా ఊరూరా ఏర్పాటు చేసింది. ఏర్పాటు చేసిందే తడవుగా తీరొక్క పూలు, నీడనిచ్చే మొక్కలు నాటి ఆహ్లాదకరంగా మార్చింది. పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు, పెద్దలు వాకింగ్ చేసేందుకు ట్రాక్, సేద తీరేందుకు బెంచీలు ఏర్పాటు చేసింది. సాయంత్రం సమయంలో, సెలవు రోజుల్లో ప్రకృతి వనాల్లో పిల్లలు, పెద్దలు చేసే సందడి అంతా ఇంతా కాదు. వీటి నిర్వహణ బాధ్యతను పంచాయతీలకు అప్పగించింది. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటి నిర్వహణ గాలికొదిలేసింది. వేంసూరు మండలంలోని పల్లె ప్రకృతి వనాలు చెత్తా చెదారంతో దర్శనమిస్తున్నాయి. మొక్కలకు నీరందక ఎండిపోతున్నాయి. పిల్లల ఆట వస్తువులు వాడకం లేక శిథిలావస్థకు చేరాయి. రాత్రిపూట మందుబాబులకు అడ్డాలుగా మారాయి. పిచ్చిమొక్కలకు నిలయంగా మారి విషపురుగులు, పాములు ఆవాసాలు ఏర్పరుచుకున్నాయి. కొందరు పశువులు మేపుతుండగా.. మరికొందరు వాహనాలు నిలిపేందుకు అడ్డాలుగా ఎంచుకున్నారు. గ్రామపంచాయతీ అధికారులు వీటి నిర్వహణను పట్టించుకోవాల్సి ఉండగా.. అటువైపు కన్నెత్తి చూసే నాథుడే లేడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

– వేంసూరు, జూన్ 24

# 'సికిల్ సెల్'కు ప్రత్యేక క్యాంపులు

భద్రాచలం, జూన్ 24 : సికిల్ సెల్ అనీమియా వ్యాధిని శాశ్వతంగా నివారించేందుకు ఈ నెల 19 నుంచి జూలై 3 వరకు గిరిజన గ్రామాలు, గూడేల్లో ప్రత్యేక శిబిరాల ద్వారా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించాలని, వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స అందించాలని మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ జయ అన్నారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి కలెక్టర్లకు, ఐటీడీఏ పీవోలకు సికిల్ సెల్ అనీమియా వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన చర్యలపై వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తంలో హిమోగ్లోబిన్ శరీరంలోని వివిధ కణాలకు ఆక్సిజన్ సరఫరా చేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. ఇది ప్రత్యేకంగా గర్భిణులు, గిరిజన చిన్నారుల కోసం రూపొందించిన కార్యక్రమమని తెలిపారు. 0 వయస్సు నుంచి 40 ఏళ్లున్న వారికి స్క్రీనింగ్ టెస్టులు చేయాలన్నారు. హిమోగ్లోబిన్ పెంచే పండ్లను ఎక్కువగా తీసుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ప్రతిరోజు నీటిని పుష్కలంగా తీసుకున్నట్లయితే ఎటువంటి వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, గురుకుల ఆర్సీవో వెంకటేశ్వరరాజు, ఏసీఎంవో రమణయ్య, హెచ్ఈవో దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు డ్రోన్లు

## భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : ప్రమాదవశాత్తు గోదావరి వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అగ్రికల్చర్ డ్రోన్లను వినియోగించనున్నట్లు భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ ప్రాంగణంలో డ్రోన్ల పనితీరును ఆయన పరిశీలించారు. ఖమ్మం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన డ్రోన్ పనితీరుపై డెమో విధానాన్ని, అలాగే గజ ఈతగాళ్లు వరదల సమయంలో చేపట్టనున్న రక్షణ చర్యలను సైతం కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలో వరద తాకిడి ఎక్కువగా ఉంటుందని, వరదలతో ప్రాణ నష్టం జరగకుండా ఈసారి సరికొత్తగా అగ్రికల్చర్ డ్రోన్లను అందుబాటులో ఉంచుతామన్నారు. వరద ముంపు నుంచి ప్రజలను రక్షించేందుకు ఈ డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. డ్రోన్ 90 మీటర్ల ఎత్తు, 250 మీటర్ల దూరం వరకు ఎగిరే అవకాశం ఉంటుందని, దీని ద్వారా వాగులు, లోలెవల్ వంతెనల్లో చిక్కుకుపోయిన వ్యక్తులకు తాళ్లను పంపి వారిని రక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఏవో బాబూరావు, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, జిల్లా మత్స్య శాఖ అధికారి వీరన్న, ఏవో గన్యా, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# 155 పోస్టులకు 4 వేల మంది దరఖాస్తు

## కలెక్టరేట్ వద్ద బారులు తీరిన నిరుద్యోగులు



దరఖాస్తు చేసుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన నిరుద్యోగులు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : వేలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం పడిగాపులు కాస్తున్నారు. చిన్న నోటిఫికేషన్ పడితే చాలు కుప్పలుకుప్పలుగా దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల వద్ద క్యూ కడుతున్నారు. జిల్లా మెడికల్ కాలేజీలో ఇటీవల 155 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ వెలువడగా కలెక్టరేట్‌లో ఉన్న ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వడానికి ఉద్యోగార్థులు భారీగా తరలివచ్చారు. సోమవారం చివరితేదీ కావడంతో కార్యాలయం కిక్కిరిసిపోయింది. ఒకవైపు ప్రజావాణి జనం.. మరోవైపు దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన నిరుద్యోగులతో కలెక్టరేట్ సందడిగా మారింది.

# సంస్థ అభివృద్ధికి క్రమశిక్షణతో పనిచేయాలి

- ఏరియా జీఎం శాలెంరాజు
- 18 మందికి కారుణ్య నియామక పత్రాలు

రామవరం, జూన్ 24 : సంస్థ కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో పనిచేసి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని ఏరియా జీఎం శాలెంరాజు అన్నారు. సింగరేణి కొత్తగూడెం ఏరియాలో పనిచేస్తూ మెడికల్ ఇన్‌వాలిడేట్/మరణించిన కార్మికుల డిపెండెంట్లకు సోమవారం తన కార్యాలయంలో కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సీఎండీ ఆదేశాల మేరకు 2018 నుంచి కారుణ్య నియామకాలు జరుగుతున్నాయని, ఈ నెలలో ఇప్పటివరకు 18 మందికి కారుణ్య నియామకాల పత్రాలు అందజేశామని తెలిపారు. నియామక పత్రాలు అందుకున్న వారికి శుభాకాంక్షలు చెబుతూ.. ఉన్నతాధికారుల సూచనలు పాటించి.. రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు, ఎస్‌వోటు జీఎం జీవీ కోటిరెడ్డి, సీనియర్ పీవో మురళి, గుర్తింపు సంఘం(ఏఐటీయూసీ) వైస్ ప్రెసిడెంట్ రాములు, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, జూనియర్ అసిస్టెంట్ అరవింద్, సింగరేణి కో ఆర్డినేటర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందుకున్న వారితో ఏరియా జీఎం శాలెంరాజు

# 'సకిని'కి కన్నీటి వీడ్కోలు

- మణుగూరులోని స్వగ్రామంలో పూర్తయిన పద్మశ్రీ అంత్యక్రియలు
- అధికారిక లాంఛనాలు కావాలన్న రామచంద్రయ్య కుటుంబ సభ్యులు
- ప్రభుత్వ నిబంధనలేమీ లేవన్న ట్రైబల్ వెల్ఫేర్ విభాగ అధికారులు
- గిరిజన సంక్షేమ శాఖ అధికారుల హాజరు.. రూ.20 వేల ఆర్థిక సాయం



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరు టౌన్, జూన్ 24: తెలంగాణ వన దేవతలు సమ్మక్క సారలమ్మల ఔన్నత్యాన్ని, జాతర వైభోవాన్ని తన డోలు వాయిద్యం ద్వారా రాష్ట్ర నలుమూలలా చాటి ఇటీవల కన్నుమూసిన డోలువాయిద్య కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్యకు స్థానికులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన అంత్యక్రియలు మణుగూరు మండలంలోని కూనవరంలో ఉన్న అతడి స్వగ్రామంలో సోమవారం పూర్తయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో ఏకైక డోలు వాయిద్య కళాకారుడిగా పేరొంది.. 2022లో కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న మణుగూరుకు చెందిన సకిరి రామచంద్రయ్య.. గొంతు సంబంధిత వ్యాధితో ఆదివారం ఇక్కడి ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచిన విషయం విదితమే. అయితే ఆదివారం భద్రాద్రి కలెక్టర్ జితేశ్ స్వయంగా వచ్చి రామచంద్రయ్య భౌతికకాయానికి నివాళులర్పించి వెళ్లారు. కానీ అధికారిక లాంఛనాలపై స్పష్టత రాకపోవడంతో అతడి దహన సంస్కారాలు సోమవారం మధ్యాహ్నం వరకూ నిలిచిపోయాయి. అధికారిక లాంఛనాలతోనైనా తన దహన సంస్కారాలు నిర్వహించాలన్న రామచంద్రయ్య చివరి కోరికను అతడి కుటుంబ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఐటీడీఏ అధికారులు అక్కడికి వచ్చి రామచంద్రయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తాము కలెక్టర్‌ను కలిసే ఇక్కడికి వచ్చామని, అధికారిక లాంఛనాలతో దహన సంస్కారాలకు నిబంధనలు లేవని అన్నారు. అనంతరం అంత్యక్రియల కోసం ట్రైబల్ వెల్ఫేర్ శాఖ నుంచి రూ.20 వేలు అందజేశారు. ఈ క్రమంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, హెచ్‌ఎం తదితర అధికారులు దహనసంస్కారాల్లో పాల్గొనాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో డీడీ సహా అధికారులందరూ దహన సంస్కారాల చివరి ఘట్టం వరకు పాల్గొన్నారు.

**పలువురి ప్రముఖుల నివాళి..**

పద్మశ్రీ సకిని రామచంద్రయ్య మృతికి పలు రాజకీయ, ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రముఖులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, జడ్పీటీసీ పోశం నర్సింహారావు, బీఆర్ఎస్ నేత వట్టం రాంబాబు వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

# గత ప్రభుత్వ విధానాలే..

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎస్ఎంఈ పాలసీ
- రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాలను యథావిధిగా కొనసాగిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'ఎంఎస్ఎంఈ–సమ్మిళిత అభివృద్ధి' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...'ప్రభుత్వాలు వస్తుంటాయ్.. పోతుంటాయ్, కానీ అభివృద్ధి ఆగకూడదు.. పారిశ్రామికాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందులో భాగంగా గత సర్కారు ప్రవేశపెట్టిన వివిధ పాలసీలను కొనసాగిస్తాం'అని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎస్ఎంఈ పాలసీని ప్రవేశపెట్టనున్నట్లు, దీంతో దేశంలోనే మొదటి ఎంఎస్ఎంఈ పాలసీ తెచ్చిన రాష్ట్రంగా తెలంగాణ నిలువనున్నదన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న కొత్త ఎంఎస్ఎంఈ పాలసీ రూపకల్పన జరుగుతున్నదని, దీనిపై సూచనలు, సలహాలు ఇవ్వాలని పరిశ్రమ వర్గాలను కోరారు. పరిశ్రమకు నైపుణ్యంగల ఉద్యోగుల అవసరం ఎంతో ఉందని, ఇందుకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు త్వరలోనే ఐఎస్‌బీ తరహాలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# మూడు నెలల్లో నైనీలో బొగ్గు ఉత్పత్తి

- సింగరేణి సీఎండీ ఎన్ బలరాం వెల్లడి



హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ నుంచి ఈ సెప్టెంబర్ చివరికల్లా బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించాలని సింగరేణి సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నది. నైనీకి 50 కిలోమీటర్ల దూరంలోనే 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని కూడా సంస్థ నిర్మించనున్నది. ఈ థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి అనువైన స్థలంతోపాటు కీలకమైన భూసేకరణ సమస్యను పరిష్కరించేందుకు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం సోమవారం ఒడిశాలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్‌జెనాతో ప్రత్యేకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైనీ కోల్‌బ్లాక్‌కు ఇప్పటికే అన్ని అనుమతులు లభించాయని, రెండో దశ అటవీ అనుమతుల కోసం నిబంధనలను పాటిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగానే రూ.180 కోట్లు చెల్లించామని, వన్యప్రాణి నిర్వహణ ప్రణాళికలో భాగంగా మరో రూ. 39 కోట్లు డిపాజిట్ చేశామన్నారు. ప్రాజెక్ట్ ప్రారంభం కోసం 783 హెక్టార్ల అటవీభూమిని తమకు బదలాయించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. నైనీ బొగ్గు గని నుంచి ఉత్పత్తికి అన్ని రకాలుగా సహకరిస్తామని ఒడిశా సీఎస్ హామీనిచ్చారు.

# 4,800 కోట్ల నుంచి సున్నాకు

## బైజూస్‌లో పెట్టుబడులను రైటాఫ్ చేసిన ప్రోసస్




న్యూఢిల్లీ, జూన్ 24: డచ్‌కి చెందిన పెట్టుబడుల సంస్థ ప్రోసస్ నిండా మునిగింది. బైజూస్‌లో పెట్టిన 578 మిలియన్ డాలర్ల(రూ.4,800 కోట్ల) పెట్టుబడులను రైటాఫ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఎడ్యుటెక్ సంస్థ బైజూస్‌లో గతంలో 9.6 శాతం వాటా కలిగివున్నది. ప్రస్తుతం ఈ వాటాను సాంకేతికంగా రద్దు చేసుకుంటున్నట్లు తెలిపింది. దీంతో సంస్థకు రూ.4,800 కోట్ల భారీ నష్టం వాటిల్లింది. ఈ విషయాన్ని నెదర్లాండ్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది. బైజూస్‌లో ఈక్విటీ ఇన్వెస్టర్ల వాటాల విలువ భారీగా క్షీణించిన నేపథ్యంలో రైటాఫ్ నిర్ణయం తీసుకున్నామని ప్రోసస్ వెల్లడించింది. దీంతో 2024 ఆర్థిక సంవత్సరంలో సంస్థ 493 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. రైట్స్ ఇష్యూకి ముందు బైజూస్‌లో 9.6 శాతం వాటా ఉందని పేర్కొంది. కంపెనీ ఆర్థిక పరిస్థితులు, అప్పులు, భవిష్యత్తు అంచనాలకు తమవద్ద ఎలాంటి సమాచారం లేకపోవడంతో బైజూస్ కంపెనీ విలువను సున్నాకు తగ్గిస్తున్నట్లు ప్రోసస్ ప్రతినిధి ఒకరు తెలిపారు.

**వాణిజ్య**

# కిర్రాక్ ఐపీవో షో

**జనవరి మొదలు పబ్లిక్ ఇష్యూకు 37 సంస్థలు • 32,000 కోట్ల సమీకరణ • 17 ఏండ్లలో ఇదే అత్యుత్తమ రికార్డు**




ముంబై, జూన్ 24: ఈ ఏడాది సెకండరీ మార్కెటే కాదు.. ప్రైమరీ మార్కెట్ కూడా దుమ్మురేపింది. బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీలు సరికొత్త స్థాయిల్లో కదలాడుతున్నాయి. మరోవైపు స్టాక్ మార్కెట్లలోకి రికార్డు స్థాయిలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లు (ఐపీవో) వచ్చేస్తున్నాయి. ఎంతలా అంటే గడిచిన 17 ఏండ్లలో ఇదే అత్యుత్తమ ప్రథమార్ధం (జనవరి–జూన్)గా నిలిచింది. ఈ ఏడాది జనవరి మొదలు ఇప్పటిదాకా 37 సంస్థలు పబ్లిక్ ఇష్యూకు వచ్చాయి. ఇందులో కో–వర్కింగ్ స్పేస్, ఫర్నీచర్ రిటైలింగ్, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వంటి కంపెనీలూ ఉండటం విశేషం. ఇవన్నీ కలిసి దాదాపు రూ.32,000 కోట్ల నిధులను సమీకరించడం గమనార్హం. ఈ వారంలోనే మూడు ఐపీవోలు ముగిశాయి.

**2007 తర్వాత..**

2007 ప్రథమార్ధంలో గరిష్ఠంగా 54 సంస్థలు దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ఐపీవోల ద్వారా ప్రవేశించాయి. నాడు అవి సమీకరించిన నిధులు రూ.20,833 కోట్లు. మళ్లీ ఆ తర్వాత ఇప్పుడే ఆ స్థాయిలో కంపెనీలు ఈక్విటీ మార్కెట్లలోకి వచ్చాయి. అయితే 2022 జనవరి–జూన్‌లో 16 సంస్థలే వచ్చినా రూ.40,311 కోట్ల నిధుల సమీకరణ జరిగింది. ప్రభుత్వ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ ఐపీవో కలిసొచ్చింది. ఈ ఒక్క పబ్లిక్ ఇష్యూ విలువే రూ.21,000 కోట్లు. ఇది గనుక లేకపోతే ఐపీవో మార్కెట్‌లో 6 నెలల్లో సమీకరించిన నిధులపరంగా ఈ ఏడాదే అత్యుత్తమం. ఇక గత ఏడాది ప్రథమార్ధంతో పోల్చితే ఈ ఏడాది ఫండింగ్ నాలుగు రెట్లు ఎగిసింది. దేశ, విదేశీ మదుపరుల మద్దతే ఇందుకు కారణం. స్టాక్ మార్కెట్ల రికార్డు లాభాలూ కారణమే. ఈ లాభాలకు ఆకర్షితులయ్యే మరిన్ని సంస్థలు ఐపీవోలకు సిద్ధమైనట్టు మార్కెట్ నిపుణులు తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు. పైగా గతంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగిన ఏ ఏడాది ప్రథమార్ధంలోనూ ఈసారి నమోదైన దాంట్లో నాల్గో వంతు కూడా పబ్లిక్ ఇష్యూలు, నిధుల సమీకరణ జరుగలేదు.

**క్యూలో మరికొన్ని..**

హ్యుందాయ్ ఇండియా, స్విగ్గీ, ఓలా తదితర ప్రముఖ సంస్థలన్నీ ఐపీవోలకు క్యూ కట్టాయి. ఇందులో హ్యుందాయ్ పబ్లిక్ ఇష్యూ దేశ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే అతిపెద్దది కానుండటం గమనార్హం. ప్రస్తుతం ఎల్ఐసీ పేరిట ఉన్న భారీ ఐపీవో రికార్డూ చెరిగిపోనున్నది. అయితే వచ్చే నెల రాబోయే కేంద్ర బడ్జెట్.. ఐపీవోల దూకుడుకు కాస్త బ్రేకులు వేయవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటిదాకా సెన్సెక్స్ 6.8 శాతం, నిఫ్టీ 8.1 శాతం పుంజుకున్నాయి. ఇక 20 శాతానికిపైగా నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, 20.5 శాతం మేర స్మాల్‌క్యాప్ 100 పెరిగాయి. స్టాక్ మార్కెట్లలో కొత్తగా లిస్టింగైన కంపెనీలూ.. మదుపరులకు ఆకర్షణీయ రాబడులనే అందిస్తున్నాయి. బీఎస్ఈ ఐపీవో సూచీ ఈ ఏడాది 21.8 శాతం ఎగబాకింది. నిధుల సమీకరణలో ఆర్థిక రంగ సంస్థలదే నాల్గో వంతు (రూ.7,879 కోట్లు) వాటాగా ఉన్నది.

*దేశీయ సంస్థలు, కుటుంబ వ్యాపారస్తులు, అపర కుబేరుల (హెచ్ఎన్ఐ) వద్ద కావాల్సినంత నగదు నిల్వలున్నాయి. దీంతో పబ్లిక్ ఇష్యూలకు విశేష ఆదరణ లభిస్తున్నది. దీన్నిచూసి మరిన్ని సంస్థలు ఐపీవోలకు క్యూ కడుతున్నాయి. ఈ ఏడాది ఇలాగే సాగితే సరికొత్త రికార్డులు ఖాయం.*

*– చిరాగ్ నేగంది, జేఎం ఫైనాన్షియల్ ఎండీ*

- చివరిసారిగా లోక్‌సభ ఎన్నికలు జరిగిన 2019 ప్రథమార్ధంలో 8 ఐపీవోలే వచ్చాయి. వాటి విలువ రూ.5,509 కోట్లు.
- 2014 జనవరి-జూన్‌లో ఒక్క ఇనీషియల్ పబ్లిక్ ఆఫరే వచ్చింది.
- 2009 తొలి అర్ధ భాగంలో రెండు ఐపీవోలు రాగా, వీటి విలువ రూ.302 కోట్లు.
- భారతీయ స్టాక్ మార్కెట్లలోకి ఈ ఏడాదిలో ఇప్పటిదాకా మ్యూచువల్ ఫండ్స్ ద్వారా వచ్చిన నిధులు రూ.1.85 లక్షల కోట్లపైనే.
- విదేశీ మదుపరులు వెనక్కి తగ్గారేమో గానీ.. దేశీయ మదుపరులు మాత్రం సై.
- ఈ జనవరి-జూన్‌లో వచ్చిన భారీ ఐపీవో భారతీ హెక్సాకామ్. దీని విలువ రూ.4,275 కోట్లు. ఆ తర్వాత ఆధార్ హౌజింగ్ ఫైనాన్స్ (రూ.3,000 కోట్లు).
- ఈ ఏడాది వచ్చిన అతిచిన్న ఐపీవో విభోర్ స్టీల్ ట్యూబ్స్. విలువ రూ.72 కోట్లు.
- నిరుడు ప్రథమార్ధంలో సగటు డీల్ పరిమాణం రూ.896 కోట్లు. ఈసారి రూ.859 కోట్లు.

## హీరో బైకులు ప్రియం

న్యూఢిల్లీ, జూన్ 24: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్ వాహన కొనుగోలుదారులకు షాకిచ్చింది. వచ్చే నెల 1 నుంచి అమలులోకి వచ్చేలా ఎంపిక చేసిన మాడళ్ల ధరలను రూ.1,500 వరకు పెంచుతూ సోమవారం నిర్ణయం తీసుకున్నది. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్లనే కొన్ని మాడళ్ల ధరలను పెంచాల్సి వచ్చిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## తగ్గిన పసిడి రిజర్వులు

న్యూఢిల్లీ, జూన్ 24: విదేశాల్లో రిజర్వు బ్యాంక్ వద్ద ఉన్న బంగారం నిల్వలు తగ్గుముఖం పట్టాయి. మార్చి 2024 నాటికి గోల్డ్ రిజర్వులు 47 శాతం వరకు తగ్గాయి. 2017 తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి కావడం విశేషం. విదేశాల్లో ఉన్న బంగారం నిల్వలను దేశానికి తరలిస్తుండటం ఇందుకు కారణం. దేశవ్యాప్తంగా బంగారం రిజర్వులు సెప్టెంబర్ 2021లో 39 శాతంగా ఉండగా, మార్చి 2024 నాటికి ఇవి 53 శాతానికి ఎగబాకాయి. ప్రస్తుతం ఆర్బీఐ వద్ద 822.1 టన్నుల బంగారం ఉంది.

# పన్ను రిబేటు పెంచాలి

- ఉద్యోగుల కోసం ట్రేడ్ యూనియన్ల డిమాండ్
- పాత పెన్షన్ పథకాన్నే అమలు చేయాలి
- కేంద్ర ఆర్థిక మంత్రితో ముందస్తు బడ్జెట్ చర్చలు




న్యూఢిల్లీ, జూన్ 24: వేతన జీవుల కోసం పన్ను రిబేటును పెంచాలని ట్రేడ్ యూనియన్లు కోరుతున్నాయి. ముందస్తు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో వివిధ వాణిజ్య, వర్తక సంఘాల నాయకులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు తమ జీతం, గ్రాట్యుటీలపై ఇప్పుడున్న ఆదాయ పన్ను (ఐటీ) రిబేటు సీలింగ్ పరిమితిని భారీగా పెంచాలన్నారు. అలాగే 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని, కొత్త పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్)ను రద్దుచేసి.. పాత పెన్షన్ పథకాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలన్న తదితర డిమాండ్లనూ మంత్రి వద్ద వినిపించారు. వచ్చే నెల పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ ఈ ఆర్థిక సంవత్సరానికి (2024–25)గాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారన్నది తెలిసిందే.


**ప్రైవేటీకరణ వద్దు**

ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల ప్రైవేటీకరణను కేంద్రం ఆపాలని కూడా ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్లు విజ్ఞప్తి చేశాయి. ఏటా పెద్ద ఎత్తున పీఎస్‌యూల్లో వాటాలను ఉపసంహరిస్తున్న మోదీ సర్కారు.. అందుకోసం లక్ష్యాలను పెట్టుకొనిమరీ ముందుకెళ్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఎయిర్ ఇండియా వంటి సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అమ్మేసిన సంగతీ విదితమే. కాగా, అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కూలీల కోసం ఓ సామాజిక భద్రతా నిధిని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని, నెలనెలా కనీసం రూ.9,000 పెన్షన్‌తోపాటు ఇతరత్రా వైద్య, విద్య ప్రయోజనాలను దానిద్వారా అందించాలని కూడా తమ మెమరాండంలో మంత్రికి యూనియన్లు సూచించాయి.

## ఈవీలపై జీఎస్టీ హేతుబద్ధం చేయాలి

విద్యుత్తు ఆధారిత వాహనాల (ఈవీ)పై జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించాలని ఆటో కంపోనెంట్స్ ఇండస్ట్రీ సంఘం (ఏసీఎంఏ) కేంద్ర ఆర్థిక, భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖలకు సమర్పించిన సిఫార్సుల్లో కోరింది. అలాగే పెట్టుబడులకు ప్రోత్సాహకాలు కల్పించాలని, ప్లాంట్–మెషినరీలపై డిప్రిషియేషన్ రేట్ల 15 నుంచి 25 శాతానికి పెంచాలని సూచించింది. ఐటీ చట్టంలోని సెక్షన్ 194ఆర్ కింద వ్యాపార ప్రయోజనాలపై పన్ను కోతలపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది. కస్టమ్స్ చట్టాల కింద వారసత్వ వివాదాల పరిష్కారార్థం ఆమ్నెస్టీ స్కీంను తేవాలని ఏసీఎంఏ అధ్యక్షుడు శ్రద్ధా సూరీ మార్వా అన్నారు.

## నేటి నుంచి స్పెక్ట్రం వేలం



న్యూఢిల్లీ, జూన్ 24: స్పెక్ట్రం వేలానికి మళ్లీ వేళాయింది. రూ.96 వేల కోట్ల విలువైన వాయుతరంగాలను మంగళవారం నుంచి విక్రయించనున్నారు. 5జీ మొబైల్ సర్వీసులు అందించడానికి సిద్ధమవుతున్న టెలికం దిగ్గజాలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు ఈ వేలంలో పాల్గొనబోతున్నాయి. అంతకుముందు ఆగస్టు 2022లో స్పెక్ట్రాని వేలం వేసిన కేంద్ర సర్కార్..ఈసారి తొలిసారిగా 5జీ సేవల కోసం తరంగాలను వేలం వేస్తున్నది. ఎనిమిది స్పెక్ట్రం బాండ్ విడ్త్ కింద వాయుతరంగాలను వేలం వేస్తే రూ.96 వేల కోట్లకు పైగా నిధులు సమకూరవచ్చునని అంచనా. ఈసారి 800 మెగాహెట్జ్, 900 మెగాహెట్జ్, 1,800 మెగాహెట్జ్, 2,100 మెగాహెట్జ్, 2,300 మెగాహెట్జ్, 2,500 మెగాహెట్జ్, 3,300 మెగాహెట్జ్, 26 గిగాహెట్జ్ వంటి తరంగాలను ఈసారి వేలానికి పెట్టారు.